క్లుప్తంగా

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

నకిరేకల్ : నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లంలలో నిర్మించిన ఉదయ సముద్రం ప్రాజెక్టును ప్రారంభించడానికి ఈ నెల 7వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. బుధవారం నకిరేకల్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.. ఈ సమావేశంలో డీసీఎంస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, నాయకులు మాద యాదగిరి, పన్నాల రాఘవరెడ్డి, రెడ్డిపల్లి సాగర్, చౌగోని శ్రీనివాస్, నకిరేకంటి నరేందర్, గాదగోని కొండయ్య, ఊశయ్య, సుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

జితేందర్‌రెడ్డి సినిమా వీక్షించిన బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : నాగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని తిరుమల థియేటర్‌లో బుధవారం ఏబీవీపీ నాయకుడు జితేందర్‌రెడ్డి సినిమాను బీజేపీ నాయకులు వీక్షించారు. జితేందర్‌రెడ్డిని 72 బుల్లెట్లతో నక్సలైట్లు హతమార్చిన తీరు, ఆయన జీవిత గాథను సినిమాగా తీసి ఉచితంగా ప్రదర్శించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి తెలిపారు. సినిమా వీక్షించిన వారిలో సీనియర్ నేత గోలి మధుసూదన్‌రెడ్డి, సినీ నిర్మాత రవీందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

తిప్పర్తి : ఎమ్మార్పీఎస్ తిప్పర్తి మండల నూతన కమిటీని బుధవారం మండల కేంద్రంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ఉదరి నవీన్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా దారమల్ల సాయికుమార్ ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బొజ్జ దేవయ్య, కొమ్ము గిరి, సురేష్, పాలడుగు అంజనేయులు, కే.సైదులు, పల్లె శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోషయ్యకు నివాళి


రోషయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

నల్లగొండ టూటౌన్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కె.రోషయ్య వర్ధంతిని బుధవారం నల్లగొండ పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రోషయ్య చిత్రపటానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోటగిరి దైవాదీనం, వీరెల్లి సతీష్, వీరెల్లి కృష్ణయ్య, బుక్క ఈశ్వరయ్య, రేపాల భద్రాద్రి రాములు, నాంపల్లి నరసింహ, బోనగిరి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జర్నలిస్టులకు మెగా హెల్త్ క్యాంపు

నల్లగొండ టూటౌన్ : జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ప్రెస్‌క్లబ్ నల్లగొండ ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్స్ మలక్‌పేట సౌజన్యంతో ఉచితంగా మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ప్రెస్‌క్లబ్ మీడియా సెక్రటరీ వరకాంతం కిరణ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎన్‌జీవోస్ భవన్‌లో నిర్వహించే హెల్త్ క్యాంపును శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే సామేల్ నివాళి

నకిరేకల్ (శాలిగౌరారం): మండలంలోని బండమీదిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరురాలు అన్నెబోయిన లక్ష్మమ్మ అనారోగ్యంతో బుధవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ బండమీదిగూడెం గ్రామంలో లక్ష్మమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఓదార్చి ఆర్థిక సహాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, కుర్ర లింగయ్య, సత్యనారాయణ, భూపతి అంజయ్య, కదారి అంజయ్య, బంటు బీరప్ప, శ్రీను, తదితరులు ఉన్నారు.

నోట్‌బుక్స్ అందజేత

కనగల్ : మండల పరిధిలోని చిన్న మాదారం ఉన్నత పాఠశాలలో పనిచేసే ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి పాఠశాలలోని ఏడో తరగతి విద్యార్థులకు బుధవారం ఎంఈఓ వి.పద్మ చేతుల మీదుగా తన సొంత ఖర్చులతో నోట్‌బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న ఎంఈఓ పద్మ, ఉపాధ్యాయుడు బుచ్చిరెడ్డి

ఆదర్శ పాఠశాలలో అన్నీ సమస్యలే

- పాఠశాల చుట్టూ శిథిల భవనాలు
- ఆట స్థలం లేక విద్యార్థుల ఇక్కట్లు
- ఆరుబయటే మధ్యాహ్న భోజన వంట

తిప్పర్తి : పేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో మెరుగైన విద్య అందించాలనే ఉద్దేశంతో 2013వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం రాష్ట్రంలో ఆదర్శ పాఠశాలలను మంజూరు చేసింది. ప్రభుత్వ ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రైవేటుకు దీటుగా ఆంగ్ల మాధ్యమంలో విద్యను బోధించడంతోపాటు, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యం. తిప్పర్తిలో ఏర్పాటు చేసిన ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు సుమారు 350 మంది విద్యార్థులు ఈ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్నారు. హాస్టల్‌లో దాదాపు 100 మంది విద్యార్థినులు ఉంటున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారు.

ఎస్ఎల్‌బీసీ స్థలం కేటాయింపు

విద్యార్థులకు విద్యతోపాటు ఆటలు కూడా ఎంతో ముఖ్యం. ఆటలు ఆడితేనే విద్యార్థులు మానసికంగా ఉల్లాసంగా ఉంటారు. అయితే తిప్పర్తి ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు ఆటలు ఆడడానికి సరైన స్థలం లేదు. తిప్పర్తిలో ప్రభుత్వ ఆదర్శ పాఠశాల నిర్మాణానికి గతంలో ప్రభుత్వం 5 ఎకరాల ఎస్ఎల్‌బీసీ స్థలాన్ని కేటాయించింది. అందులోరెండు ఎకరాలు స్కూల్ బిల్డింగ్, హాస్టల్‌కు కేటాయించారు. ఆ స్థలంలో కొన్ని శిథిల భవనాలను కూల్చి పాఠశాలను నిర్మించారు. మిగిలిన స్థలంలో ఆ పాఠశాల ఆవరణలో కొన్ని ఎస్ఎల్‌బీసీ సిబ్బంది నివాస గృహాలు శిథిలావస్థలో ఉన్నాయి. వాటిని తొలగించినట్లయితే ఆటస్థలం ఏర్పాటు చేయవచ్చు. అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించి ఆట స్థలం ఏర్పాటు చేయాలని విద్యార్థులు, గ్రామస్తులు కోరుతున్నారు.


తిప్పర్తి ప్రభుత్వ ఆదర్శ పాఠశాల భవనం

వర్షాకాలం వస్తే వంటకు ఇబ్బంది

ఆదర్శ పాఠశాలలో వంట చేసేందుకు షెడ్డు కూడా లేదు. దీంతో మధ్యాహ్న భోజన వంట కార్మికులు విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఆరు బయట చెట్ల కింద వండుతున్నారు. వర్షాకాలం వస్తే వంట చేయడం ఇబ్బందికరంగా మారుతోంది. దీంతో మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.

పాఠశాలలో విద్యుత్ సమస్య

ఆదర్శ పాఠశాల నిర్మాణ సమయంలో విద్యుత్ షార్టు సర్క్యూట్ జరిగింది. దీంతో పాఠశాలలో అప్పుడప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఎర్తింగ్ లేకపోవడంతో ఫ్యాన్లు, కంప్యూటర్లు ఇతర ఎలక్ట్రిక్ వస్తువులు కాలిపోతున్నాయి. పాఠశాలలో విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించేవిధంగా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

స్టేజీ లేకపోవడంతో..

పాఠశాల ఆవరణలో స్టేజీ లేకపోవడంతో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం లేదా దాతలు స్పందించి పాఠశాల ఆవరణలో స్టేజీని ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.


శిథిలావస్థలో ఉన్న ఎస్ఎల్‌బీసీ నివాస గృహాలు


చెట్ల కింద వంట చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

శిథిల భవనాలను తొలగించాలి



పాఠశాలలో 350 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థులు ఆటలు ఆడుకోవడానికి ఆటస్థలం లేక ఇబ్బంది పడుతున్నారు. పాఠశాల చుట్టూ శిథిలావస్థకు చేరిన భవనాలు ఉన్నాయి. వాటిని తొలగించినట్లయితే ఆటస్థలం ఏర్పాటవుతుంది. అధికారులు స్పందించి శిథిల భవనాలను తొలగించి ఆట స్థలం ఏర్పాటుకు సహకరించాలి.

–అపర్ణ, తిప్పర్తి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్

కాంగ్రెస్ పాలనలో మహిళలకు పెద్దపీట

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : కాంగ్రెస్ పాలనలో మహిళలకు పెద్దపీట వేస్తున్నామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా నకిరేకల్‌లోని సాయి కల్యాణ మండపంలో బుధవారం నియోజకవర్గ స్థాయిలో బ్యాంక్ రుణాల కింద 1948 మహిళా సంఘాలకు రూ.178.48 కోట్లు, స్త్రీనిధి కింద 535 సంఘాలకు రూ.10.92 కోట్ల విలువ గల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు పర్యవేక్షించేందుకు అమ్మ ఆదర్శ కమిటీలను మహిళా సంఘాలకే అప్పగించామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా వృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, డీపీఎం మోహన్‌రెడ్డి, డీసీఎంస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, స్థానిక వార్డు కౌన్సిలర్ గాజుల సుకన్య, ఆయా మండలాల ఏపీఎంలు నరహరి, యాదమ్మ, సైదులు, శ్రీదేవి, పద్మ, రాంప్రసాద్, సీసీ స్వరూప పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

నకిరేకల్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బుధవారం ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్మన్‌గా గుండా వెంకటయ్య ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే తదితరులు పాల్గొన్నారు.


నకిరేకల్ : మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రేషన్ దుకాణం ప్రారంభం

కట్టంగూర్ : మండలంలోని బొల్లేపల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన రేషన్ దుకాణాన్ని బుధవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మాద యాదగిరి, పెద్ది యాదగిరి, ఎర్ర వెంకన్న, శివ, శ్రీను, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

నకిరేకల్ : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం నాణ్యతగా అందించాలని నకిరేకల్ తహసీల్దార్ జుమురుద్దీన్ సూచించారు. నకిరేకల్ మండలం నోముల, ఓగోడు గ్రామాల్లోని జెడ్పీ హైస్కూళ్లను బుధవారం ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అనంతరం ఇస్లాంపుర్, టేకులగూడెం, ఓగోడు, నోముల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

నల్లగొండ: పట్టణంలోని ప్రతి వార్డులో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, సీసీ రోడ్లు నిర్మించి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని నీలగిరి మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని 7వ వార్డు ధాత్రి నగర్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డితో కలిసి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు బుర్రి శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.216 కోట్ల నిధులతో నల్లగొండ పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. చాలా వార్డుల్లో పనులు పూర్తి కావొస్తున్నాయని చెప్పారు. వచ్చే సంవత్సరం మే వరకు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను పూర్తి చేస్తామన్నారు. పట్టణంలో ప్రతిరోజు ఇంటింటికీ మంచినీరు సరఫరా చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నెల 7న సీఎం రేవంత్ రెడ్డి నల్లగొండ పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, పాశం రాంరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, కౌన్సిలర్ భవాని గణేశ్, ప్రదీప్ నాయక్, చిన్నాల అలివేలు జానయ్య, గుండగోని సాయి, బాబా, వజ్జ రమేష్ యాదవ్, మోషే, పిల్లి రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నల్లగొండ నియోజకవర్గ వ్యాప్తంగా పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి బుధవారం మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద మున్సిపల్ పార్కులో పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, నల్లగొండ, తిప్పర్తి, కనగల్ మండలాల మాజీ జెడ్పీటీసీలు వంగూరి లక్ష్మయ్య, పాశం రాంరెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, వంగాల అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

సమస్యలు పరిష్కరించాలని వినతి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణం ముషంపల్లి రోడ్డులోని మధురానగర్ కాలనీ వరకు సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతూ కాలనీ అసోసియేషన్ నాయకులు బుధవారం మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కాలనీలో వీధి లైట్లు వెలగడం లేదని, రోడ్లు సరిగా లేక తీవ్ర అవస్థలు పడుతున్నామని వివరించారు. మధురానగర్ కాలనీకి వెళ్లే రోడ్డు వద్ద ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ చైర్మన్ వారణాసి రవికాంత్ శర్మ, ప్రధాన కార్యదర్శి రేఖ లింగయ్య, గణేష్, కాలనీ గౌరవాధ్యక్షుడు బోదనపు కృష్టారెడ్డి, ఉపాధ్యక్షులు మైల నాగార్జునరెడ్డి, పిండి నర్సిరెడ్డి, వరకాంతం కిరణ్‌రెడ్డి ఉన్నారు.

మహిళలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తాం

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: మహిళల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసి తీరుతామని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేసిన అప్పులు తీర్చుతున్నందున సకాలంలో హామీలు అమలు చేయలేకపోతున్నామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మునుగోడులో నిర్వహించిన ప్రజా పాలన–విజయోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో బెల్టు దుకాణాల నిర్మూలనకు ప్రతి మహిళ సహకరించాలని కోరారు. అనంతరం పలువురు మహిళలకు మంజూరైన వడ్డీ రాయితీ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల డీఆర్‌డీఓలు శేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి, డీపీఓ మురళి, చండూరు ఆర్డీఓ శ్రీదేవి, ప్రజాపాలన విజయోత్సవాల నియోజకవర్గ కోఆర్డినేటర్ బొజ్జ సంధ్యారాణి, నారబోయిన రవి, ఐకేపీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు ఇప్పించండి సారూ..

ప్రజా పాలన విజయోత్సవాల సభలో పాల్గొన్న ఎమ్మెల్యేను పలువురు మహిళలు కలిశారు. ఇటీవల తమ కుమార్తెల వివాహాలు చేశాం, తమకు ఇంకా కల్యాణలక్ష్మి చెక్కులు రాలేదు.. ఎలాగైనా ఇప్పించండి సారూ అని వేడుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే అక్కడే ఉన్న ఆర్డీఓతో మాట్లాడారు. నూతనంగా చండూరు డివిజన్ ఏర్పాటు కావడంతో చెక్కుల పంపిణీలో ఆలస్యం జరిగిందని ఇప్పటికే డివిజన్‌లోని ఐదు మండలాలకు 590 మందికి చెక్కులు మంజూరయ్యాయని, అతి త్వరలో పంపిణీ చేస్తామని ఆర్డీఓ తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

మునుగోడు మండలంలోని పులిపలుపుల గ్రామంలో నిర్మించనున్న ఆరోగ్య ఉప కేంద్రం భవనం, బీరెల్లిగూడెంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అదేవిధంగా కొరటికల్ గ్రామంలో రూ.2 కోట్ల 30 లక్షలతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు భూమిపూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీపీఓ మురళి, పంచాయతీరాజ్ డీఈ నాగేశ్వరరావు, ఏఈలు సతీష్‌రెడ్డి, మణిదీప్, ఎంపీడీఓ విజయభాస్కర్, విద్యుత్‌శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు నారబోయిన రవి, భీమనపల్లి సైదులు, దోటి నారాయణ, మందల బీరప్ప, వట్టికోటి శేఖర్, జాల వెంకన్న, పాల్వాయి చెన్నారెడ్డి, జితేందర్ రెడ్డి, బూడిద లింగయ్యయాదవ్, అన్వర్, తాటికొండ సైదులు, జనిగల సైదులు పాల్గొన్నారు.


మునుగోడులో మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

యూత్ కాంగ్రెస్ కమిటీల ఎన్నిక

కేతేపల్లి: యూత్ కాంగ్రెస్ కేతేపల్లి మండల అధ్యక్షుడిగా ఉప్పలపహాడ్ గ్రామానికి చెందిన మున్న అశోక్‌యాదవ్ విజయం సాధించారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఆన్‌లైన్ పద్ధతిలో ఇటీవల నిర్వహించిన ఓటింగ్‌లో నలుగురు అభ్యర్థులు పోటీపడ్డారు. బుధవారం ఓట్లు లెక్కించగా 1369 ఓట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచిన మున్న అశోక్‌యాదవ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 643 ఓట్లతో రెండో స్థానంలో నిలిచిన మాచర్ల కిరణ్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనట్లు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ప్రకటించాయి. నూతనంగా ఎన్నికైన యూత్ కాంగ్రెస్ మండల కార్యవర్గాన్ని స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందించారు.


అశోక్‌యాదవ్

కనగల్ మండల అధ్యక్షుడిగా పవన్‌కళ్యాణ్

కనగల్ : యూత్ కాంగ్రెస్ కనగల్ మండల నూతన అధ్యక్షుడిగా తుర్కపల్లి గ్రామానికి చెందిన కట్టెబోయిన పవన్‌కళ్యాణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను కనగల్ మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందించారు.


పవన్‌కళ్యాణ్

నియోజకవర్గ అధ్యక్షుడిగా రఘుమారెడ్డి

చిట్యాల: నకిరేకల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ పార్టీ పదవులకు ఆ పార్టీ ఇటీవల నిర్వహించిన ఓటింగ్ ఫలితాలను జాతీయ యూత్ కాంగ్రెస్ బాధ్యులు బుధవారం విడుదల చేశారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన ఏనుగు రఘుమారెడ్డి 2800 ఓట్లతో విజయాన్ని సాధించారు. ఆయన ప్రస్తుతం వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్‌గా ఉన్నారు. ఉపాధ్యక్షులుగా చిట్యాల పట్టణానికి చెందిన పల్లపు చంద్రశేఖర్, ఎండీ.ముజాహిద్‌తోపాటు రామన్నపేట మండల సిరిపురం గ్రామానికి చెందిన పున్న అమరేందర్, జనరల్ సెక్రటరీగా నార్కట్‌పల్లి మండలం నెమ్మాని గ్రామానికి చెందిన పెద్దింటి అనిల్‌రెడ్డి ఎన్నికయ్యారు.


రఘుమారెడ్డి

శాలిగౌరారం మండల అధ్యక్షుడిగా గణేశ్

నకిరేకల్ (శాలిగౌరారం): రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఎన్నికల ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. యూత్ కాంగ్రెస్ శాలిగౌరారం మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన బొల్లికొండ గణేశ్ ఎన్నికయ్యారు. అదేవిధంగా తుంగతుర్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన వేముల గోపినాథ్ ఎన్నికయ్యారు.


బొల్లికొండ గణేశ్

అయ్యప్ప పడిపూజ మహోత్సవం

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో పొట్లపల్లి సురేష్ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి 18వ పడిపూజ మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, డీసీసీ ఉపాధ్యక్షుడు కందిమళ్ల శిశుపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, మాజీ జెడ్పీటీసీ మాద యాదగిరి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నీలకంఠం లింగస్వామి, సాగర్ల నాగరాజు, గోలి గణేశ్, ఓర్సు యాదయ్య పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం

ప్రజాపాలనపై కళాజాతా

తిప్పర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధి పనులు, ప్రజాపాలన కార్యక్రమంపై తిప్పర్తి మండల కేంద్రంలో బుధవారం కళాకారులు కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి నర్సింహస్వామి, నాయకులు పాశం నరేష్‌రెడ్డి, జాకటి మోషే, బద్దం సైదులు పాల్గొన్నారు.

చిన్మయ కృష్ణదాస్ అరెస్టు అక్రమం


ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ఐక్య వేదిక సభ్యులు

రామగిరి(నల్లగొండ) : బంగ్లాదేశ్‌లో శాంతియుత నిరసనలకు నాయకత్వం వహిస్తున్న ఇస్కాన్ స్వామిజీ చిన్మయ కృష్ణదాస్ అరెస్టు అక్రమమని ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు వేదాంతం రామకృష్ణ అన్నారు. హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నల్లగొండలోని రామగిరి రామాలయం నుంచి క్లాక్‌టవర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని హిందూ దేవాలయాల పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. తెలంగాణ సేవా ప్రముఖ్ శివశంకర్ మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని రక్షించుకోవడానికి సంఘటితంగా పోరాడాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రభుతరుణ్ మోహన్‌దాస్, హిందూ ఐక్య వేదిక జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నేతి రఘుపతి, కట్ట సూర్యసంపత్, అంజిరెడ్డి, రమేష్, రాంప్రసాద్, వెంకటయ్య, హరిరామకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నరేష్, సంపత్, ఇటికాల కృష్ణయ్య, సంకటి వీరేష్, సైదులు, బండారు ప్రసాద్, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, గోపికృష్ణ, శ్రవణ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు


హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

నల్లగొండ క్రైం : రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు బుధవారం నల్లగొండ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ రాజు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పట్టణంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని, రోడ్డు భద్రత, నిబంధనలపై వాహనదారులను చైతన్యం చేస్తున్నామని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కనగల్ : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో మండలంలోని పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కనగల్ మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు. కనగల్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు కూసుకుంట్ల రాజిరెడ్డి, మాజీ సర్పంచులు రమణారెడ్డి, నర్సింగ్ కృష్ణయ్య గౌడ్, బాబురావు, బోగరి రాంబాబు, నాయకులు కొరివి శంకర్, దిలీప్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకటేశం, గౌని నరేష్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల మంజూరుపై హర్షం

కనగల్ మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ మండలంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు పలుమార్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని కనగల్‌తోపాటు తిప్పర్తి మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయించారు. కళాశాల మంజూరు చేయడంపై మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.


చెక్కు అందజేస్తున్న నాయకులు

బీజేపీ బలోపేతానికి శ్రమించాలి

నకిరేకల్(శాలిగౌరారం): బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు నిరంతరం శ్రమించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య అన్నారు. శాలిగౌరారం మండలంలోని అంబారిపేట, చిత్తలూరు గ్రామాల్లో బుధవారం రామచంద్రయ్య ఆధ్వర్యంలో బూత్‌కమిటీల ఎన్నిక నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు జమ్ము రమేశ్, వినోద్, షేక్ సయ్యద్, గిరగాని యాదగిరి, రాచమల్ల శ్రీను, తోట యాదగిరి, గట్టయ్య, కప్పల శ్రీనివాస్, అన్నపూర్ణ, అనిత, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి అన్ని పార్టీల మద్దతు

రామగిరి(నల్లగొండ): ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి అన్ని పార్టీలు, సంఘాలు మద్దతు తెలిపాయని మాదిగ సంఘాల మహాకూటమి రాష్ట్ర చైర్మన్ పోకల కిరణ్ మాదిగ తెలిపారు. నల్లగొండలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమది న్యాయమైన డిమాండ్ అని అసెంబ్లీ తీర్మానాలు, సుప్రీంకోర్టు తీర్పులు తేల్చాయన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నకిరేకంటి సంజీవరావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగన్న గౌడ్, గోసంగి శ్రీనివాస్, బూసిపాక వెంకటయ్య, ఆదిమల్ల శంకర్, ధర్మారపు శ్రీనివాస్, పోలేపల్లి ఉదయ్‌కుమార్, పోకల రవికుమార్, రాంప్రసాద్, మురళీకృష్ణ, ఆశయ్య, సైదులు, నగేష్, శంకర్, నరసన్న, సైదులు, రాజేష్, శ్రీరాములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పోకల కిరణ్

రేషన్ బియ్యం పట్టివేత

నకిరేకల్ : అక్రమంగా తరలిస్తున్న 60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నకిరేకల్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలం తాటికల్లు గ్రామానికి చెందిన నోముల రామలింగయ్య నుంచి కొందరు వ్యక్తులు 60 క్వింటాళ్ల రేషన్ బియ్యం కొనుగోలు చేసి డీసీఎం, అశోక్ లే లాండ్ ట్రాలీ వాహనంలో అక్రమంగా హైదరాబాదు వైపు తరలిస్తుండగా నకిరేకల్ బైపాస్ సమీపంలో గల నాగేష్ హోటల్ వద్ద పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పట్టుబడిన నల్లగొండకు చెందిన మేడిగ శ్రీకాంత్, మురికినూతల భిక్షం, డీసీఎం డ్రైవర్ పందుల శంకర్‌తో పాటు రామలింగయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది వెంకటేశ్వర్లు, మధుకర్, జనార్దన్, సురేష్, రమేష్ పాల్గొన్నారు.